ప్రజాశక్తి
శుక్రవారం 22 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం

ఎస్‌సి అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎస్‌సి అభ్యర్థులకు ఎపిఎస్ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు గురు పురుషులు, ఐదు గురు మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు అయ్యే ఖర్చు పూర్తిగా ఎస్‌సి కార్పొరేషన్ భరిస్తుందన్నారు. 20ఏళ్లు పైబడిన ఆసక్తి గల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు, కనీసం ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయవచ్చని వివరించారు. దరఖాస్తులను కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, డా. మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం-535003 చిరునామాకు ఈనెల 27లోగా సమర్పించాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9030014742, 9642460838, 9652600967 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

వికలాంగులను ఏడి 'పింఛెన్'

ఎలా బతకాలి?

ఈమె పేరు వర్రి అప్పలరాం. సాలూరు మండలం కూర్మరాజుపేట గ్రామం. భర్త వర్రి అప్పారావు మరణించడంతో ఆమె అనాధగా మిగిలింది. ఒక కన్ను పూర్తిగా పోయింది. అదేవిధంగా ఒక కాలు కూడా విరిగిపోయింది. ఈమెకు గత 15 ఏళ్లుగా వికలాంగుల పింఛను పంపిణీ అవుతోంది. కొద్దిరోజుల క్రితం ఈమెకు పింఛను తొలగిస్తూ నోటీసు జారీ అయింది. అప్పటి నుంచి నిద్రాహారాలు లేక రోధిస్తోంది. ఈమెకు పిల్లలు కూడా ఎవరూ లేరు. ఎలా బతకాలని అధికారులను ప్రశ్నిస్తోంది.

తొలగిస్తామంటూ 2574మందికి నోటీసులు

అనర్హుల ఏరివేతలో అర్హులకూ కోత

ఎలా బతకాలంటూ రోధిస్తున్న బాధితులు

20ఏళ్ళుగా పింఛను అందుకుంటున్నా

ఈయనది కూడా సాలూరు మండలం కూర్మరాజుపేట గ్రామం. ఈయన లెప్రసీ రోగి. కాళ్ళు రెండూ లెప్రసీ కారణంగా చచ్చుబడిపోయాయి. 20ఏళ్ళుగా ఈ రోగంతో బాధపడుతున్నాడు. రూ.70 పింఛను ఉన్నప్పటి నుంచి పింఛను అందుకుంటున్నానని, తనకు ఇప్పుడు తొలగిస్తామని నోటీసు ఇవ్వడం అన్యాయమని గోపాల్ ఆవేదన చెందుతున్నాడు.

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అనుకున్నంత పని చేసింది. వికలాంగుల్లో అనర్హుల ఏరివేతపై దృష్టి సారించింది. పింఛన్ల రూపంలో ప్రభుత్వంపై నెలనెలా పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. సచివాలయం సిబ్బందితో గ్రామాల్లో సర్వే నిర్వహించింది. అనర్హులనే అనుమానాలున్న వికలాంగులందరికీ నోటీసులు జారీ చేసింది. కొద్ది నెలల క్రితం వికలాంగులకు సంబంధించిన ధ్రువపత్రాలను ప్రభుత్వ వైద్యులతో పరిశీలన చేయించింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వైద్యులు భూతద్దాల్లో వికలాంగుల వైకల్యాన్ని పరిశీలించి ధ్రువ పత్రాలు జారీ చేశారు. ఈ క్రమంలో చాలా మంది వికలాంగులకు గతంలో నమోదైన వైకల్య శాతం కన్నా తగ్గించి వైద్యులు ధ్రువీకరించారు. ఈ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం వడపోత కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా మన్యం జిల్లాలో 2574 మంది వికలాంగులకు సచివాలయం సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ఫించన్ ఎందుకు తొలగించకూడదంటూ నోటీసులు అందడంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. అనర్హులని నోటీసులు జారీ చేసిన వారిలో చాలామంది అర్హులు కనిపిస్తున్నారు. పింఛను డబ్బులు రాకపోతే బతకలేమని వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 13,528మంది వికలాంగులకు పింఛన్లు అందుతున్నాయి. వీరిలో 3318మందికి ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. వీరిలో 671మంది వికలాంగులకు వృద్ధాప్య పింఛను లబ్దిదారులుగా మార్పు చేసింది. 49మందికి వికలాంగుల పింఛనుకు అర్హులను నిర్ణయించింది. మరో 24మంది 18 ఏళ్ల లోపు మానసిక వికలాంగులకు కూడా పింఛను కొనసాగింపునకు నిర్ధారించింది. ఇవి పోగా మిగిలిన 2574 మందికి నోటీసులు జారీ చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. వీరిలో అనేకమంది గత పదేళ్లుగా, 20ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వారు కూడా ఉండడంతో వారి ఆవేదన వర్ణనాతీతం. జిల్లాలో వికలాంగులకు పంపిణీ చేస్తున్న పింఛన్లలో దాదాపు 20శాతం మందిపై వేటు వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వడపోత కార్యక్రమం చేపట్టినట్లు తెలుస్తోంది. గతంలో వికలాంగులకు వైకల్యం నిర్ధారణలో కొంత సరళంగా వ్యవహరించిన ప్రభుత్వ వైద్యుల మెడపై రాష్ట్ర ప్రభుత్వం కత్తిపెట్టి కోతకు సహకరించేలా ఒత్తిడి పెంచిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ వైద్యులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగుల వైకల్యం ధ్రువీకరణపైనా కోత విధించారు.

గుమ్మలక్ష్మీపురం : జియమ్మ వలస మండలం పెద్ద బుడ్డిడిలో 9మంది వికలాంగ పింఛన్లను ప్రభుత్వం తొలగించింది. వీరిలో సునాది గంగన్న దొర , పి.వీరన్న, జి.సత్యం మాట్లాడుతూ అర్హులమైన తమ పింఛన్ల తొలగిస్తే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

517 మంది వికలాంగులకు నోటీసులు

సీతానగరం : మండలంలోని 517 మంది వికలాంగులకు నోటీసులు రావడంతో వారిలో ఆందోళన మొదలైంది. మండలంలోని కాశీపేట, లక్ష్మీపురం, గెడ్డలుప్పి, తామర కండి, పెద్ద భోగి తదితర గ్రామాలకు చెందిన వికలాంగులు నోటీసులు అందజేయడంతో వారి సదరం సర్టిఫికెట్లతో ఎంపిడిఒ కార్యాలయాలకు వచ్చి తమగోడును వినిపించుకుంటున్నారు. తాము ఎప్పటి నుంచో పింఛను పొందుతున్నామని, ఇప్పుడు తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన తమకు పింఛన్లు కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సీతానగరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వికలాంగులు

కేన్సర్‌తో మరో మహిళ మృతి

అధికార యంత్రాంగానికి పట్టని రోదన

కేన్సర్‌తో బాధపడుతున్న మహాలక్ష్మిని రెండు నెలల క్రితం పరామర్శించిన సిపిఎం నాయులు (ఫైల్)

ప్రజాశక్తి - కొమరాడ

ఆ పంచాయతీని కేన్సర్ భూతం వదలడంలేదు. దీంతో నెలకు, రెండు నెలలకు ఒకరు కేన్సర్ బారిన పడి మృతి చెందుతున్నారు. అయినా అధికార యంత్రాంగానికి పట్టడం లేదని స్థానిక ప్రజల నుంచి ఆగ్రహం, ఆవేదన వ్యక్తమవుతున్నాయి.

మండలంలోని గంగరేగువలస, స్వామి నాయుడు వలస గ్రామాల్లో వరుస కేన్సర్ రోగులు మృతి చెందుతున్న విషయంపై గతంలో సంచలమైంది. ఇప్పటికీ కేన్సర్ వ్యాధి వ్యాప్తికి గల కారణాలపై అధికారులు నిగ్గు తేల్చకపోవడం, ఈ వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టకపోవడంతో మరణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 13 మంది కేన్సర్ బారిన పడి మృతి చెందారు. అయినా అధికారి యంత్రాంగం స్పందించకపోవడం చాలా దారుణమని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సుమారుగా 12 మంది వరకు కేన్సర్ బారిన పడి మంచానికి పరిమితమై చికిత్స కోసం అవస్థలు పడుతున్నారు. నెలకు, రెండు నెలలకు ఒకరు చొప్పున ఇలా కేన్సర్ భూతం బారిన పడి మృతి చెందుతున్నారు. ఇందులో భాగంగా గురువారం గంగరేగువలసకు చెందిన మర్రిశర్ల మహాలక్ష్మి (72) కేన్సర్‌తో బాధపడుతూ మృతి చెందారు. ఈ వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టినా, ఇప్పటికీ ఫలితం శూన్యం అనే చెప్పొచ్చు. కేన్సర్ వ్యాధిపై అప్పట్లో వార్తా కథనాలు రావడంతో కలెక్టర్ స్పందించి కమిటీ వేసినప్పటికీ ఇప్పటికీ ఆ కమిటీ కేన్సర్ వ్యాధికి గల కారణాలను నిగ్గు తేల్చకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అధికారి యంత్రాంగం, ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీలో ఉన్న కేన్సర్ రోగులకు ప్రభుత్వం తరపు నుంచి చికిత్స అందించి మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం అందిస్తే ఆ కుటుంబాలు కొంత ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుందని రోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి : సిపిఎం

కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కేన్సర్‌తో మృతి చెందిన మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో గత కొన్నాళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్న మహాలక్ష్మిని జులైలో పరామర్శించామన్నారు. రెండు నెలల్లో ఆమె మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికే పంచాయితీ పరిధిలో వివిధ రకాల కేన్సర్ వ్యాధితో సుమారు 13 మంది మృతి చెందారన్నారు. ఇంకా అనేకమంది ఈ వ్యాధితో బాధపడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేన్సర్ వ్యాప్తికి గల కారణాలు గుర్తించి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటి వరకు కేన్సర్ బారినపడి మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేన్సర్ వ్యాధి కారణాలు నిర్మూలనకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



క్వారీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాభిప్రాయం తర్వాతే తవ్వకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మరోసారి ప్రజల అభిప్రాయాన్ని పూర్తిస్థాయిలో తీసుకుని బడిదేవరకొండ కోరి నిర్వహణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. బడిదేవరకొండ వల్ల తమకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చెరువు కలుషితమైందని, వెంటనే ఈ క్వారీ నిర్వహణ ఆపాలని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కొండను ఆయన పరిశీలించారు. ముందుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడిదేవరకొండ పేరు ఈ పరిసర ప్రాంతాల ప్రజలకు ఒక పవిత్రమైందని, ఈ ప్రాంత ప్రజలు దైవంగా భావిస్తున్నారని, ఈ కొండ వర్షాన్ని ఇచ్చే దైవంగా భావిస్తూ ప్రతి ఏటా పూజలు చేస్తుంటారని అన్నారు. అయితే ఈ కొండను తవ్వడానికి అనుమతులున్నప్పటికీ, సంబంధిత యాజమాన్యం నిబంధనలు పాటించడం లేదని, నిబంధనలు ఉల్లంఘించడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడి ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్వారీ వల్ల ఓ రకమైన పౌడర్ వంటి పదార్థం చెరువులో కలవడం వల్ల నీరంతా కలుషితమై పంటలకు, చేపలు పెంపకం పనికిరాకుండా పోయిందని,. రాత్రి వేళల్లో విపరీతమైన శబ్దాలు రావడంతో కొండ పక్కన గల గ్రామాల ప్రజలు నిద్రకు నోచుకోలేకపోతున్నారని అన్నారు. ఈ విషయంపై తనకు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఈ పర్యటనకు వచ్చానని, మళ్లీ ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొనేందుకు రెవెన్యూతో పాటు సంబంధిత అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. గ్రామస్తులు ఏదైతే పూర్తిస్థాయిలో అభిప్రాయాన్ని తెలుపుతారో ఆ అభిప్రాయానికి సంబంధిత యాజమాన్యం, అధికారులు కట్టుబడి ఉండాలని అన్నారు. ఎప్పుడూ ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందని, ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమన్నారు. ఎమ్మెల్యేతో పాటు టిడిపి సీనియర్ నాయకులు, స్థానిక పెద్దలు, గ్రామస్తులు ఉన్నారు..

ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి, వేతనాలు పెంచాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్
ఎమ్మెల్యే, తహశీల్దార్లకు వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, 1810 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టెన్త్ క్లాస్ లేదని ప్రమోట్ చేయలేదని, వారిని కూడా సర్వీస్ ఆధారంగా ప్రమోట్ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యాన గురువారం స్థానిక ఎమ్మెల్యే విజయచంద్రకు, తహశీల్దార్‌కు అంగన్వాడీల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, మన రాష్ట్రంలో 2019 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, పోషణట్రాక్టరు, బాలసంజీవిని యాప్‌ల అమలుకు ఫోన్లు సపోర్ట్ చేయటంలేదని, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అధికారులు లబ్దిదారులకు ఫొటోక్యాప్చర్, ఒటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారా మాత్రమే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలుకు అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరుకులన్నీ ఒక్కసారిగా రావడంలేదని, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడం వల్ల లబ్దిదారులంతా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కావున, అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలని, యాప్‌లన్నీ కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్, ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటరు నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జి నెట్ ఇవ్వాలని, ప్రధాన మంత్రి మాతృ వందనం పథకాన్ని కొత్తగా అంగన్వాడీలకు అప్పగించరాదని, గ్రాడ్యుటీ జీవోలో మార్పులు చేయాలని, హెల్పర్లు ప్రమోషన్లకు మార్గదర్శకాలు రూపొందించాలని, ఆ దిశగా వెంటనే అంగన్వాడీ యూనియన్ని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం ప్రాజెక్టు కార్యదర్శి అలివేలు, అధ్యక్షులు గౌరీమణి, సాయిలత, గౌరి, మండల కార్యకర్తలు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం :అంగన్వాడి కార్యకర్తలకు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్వాడీల జీవో ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు కోరారు. గురువారం తహశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, నాయకులు వి.రామలక్ష్మి అంగన్వాడీలపై పని భారం పెరిగిందని 42 రోజులు చారిత్రాత్మక సమ్మె చేపట్టిన సందర్భంగా 2024 జూలై నెలలో జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారని, ఆ హామీ నేటి వరకు నెరవేర్చలేదని అన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎం.సత్యవతి, ఎం.సునీత, పి. పద్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పాచిపెంట ప్రాజెక్ట్ కార్యదర్శి కొత్తకోట పార్వతీదేవి మాట్లాడుతూ 2014 నుంచి వేతనాలు పెంచకపోవడం వల్ల అంగన్వాడీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ చాలా ప్రాధాన్యత కలిగిన ఐసిడిఎస్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ ఇబ్బందులు గురి చేస్తుండటం సరైంది కాదని అన్నారు. అనంతరం తహశీల్దార్ రవికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.బంగారమ్మ, సుగుణమ్మ, సాయి పూజ, సీనియర్ నాయకులు తేడా ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: అంగన్వాడి కేంద్రాలలో ముఖ హాజరు నియమాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్‌కు అంగన్‌వాడీలు వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్‌లుగా నియమించాలని, వేతనాలను పెంచి, గ్రాడ్యుటీ జీవోలో మార్పులు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అధ్యక్షులు శశికళ, గౌరీశ్వరి, పుష్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: ఎఫ్ఆర్‌సి రద్దు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడి కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమం యూనియన్ నాయకులు పద్మావతి, వెంకటలక్ష్మి, దీప, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

సీతానగరం తహశీల్దార్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలి

వెల్ఫేర్ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలి
ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

స్త్రీ శక్తి పథకం (మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం)తో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తక్షణమే వాహనమిత్ర కింద రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) డిమాండ్ చేసింది. శ్రీ కోట దుర్గ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదగా ఆర్‌టిఒ కార్యాలయం వరకూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు.ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ పాలకొండ ప్రాంతం గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, సిఐటియు సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి అమలు చేస్తున్న ఫ్రీ బస్ సౌకర్యంతో స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సొంత పెట్టుబడితో ఒకపక్క ఫైనాన్స్ కిస్తీలు, మరోవైపు ఆర్టీవో ఆఫీసులో పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో రవాణా రంగా కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఆ హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. రవాణా రంగం నుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ ఆ కార్మికులకు ఇంతవరకు సంక్షేమ చట్టాన్ని రూపొందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వాహన మిత్ర కింద రూ.10వేలు నుంచి రూ.15 వేలకు పెంచి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఆటోడ్రైవర్లకు జరిగే నష్టానికి ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరు లోగా ఆటో కార్మిక సమస్యలపై పరిష్కారానికి ప్రకటించకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు వినతిని అందజేశారు. కాదా రాము అధ్యక్షతన జరిగిన ఆటో ర్యాలీలో క్యాబ్ డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు పి.శేఖర్, పి.మహేష్, డి.దుర్గారావు, కె.శ్రీను, మహేష్, బి.ప్రసాదు, ఎన్.రాంబాబు, పి.సాయికుమార్, పి.గౌరేశ్వరరావు, పి.రామారావు, శంకర్రావు, వడ్డాది భోగిరాజు, కె.ఎరకారావు, ఎస్.సన్యాసినాయుడు, ఎస్.నాగరాజు, ఎస్.కామేశ్వరరావు, ఎన్.సుదర్శన్‌రావు, కోటి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో భారీ ర్యాలీ నిర్వహిస్తు ఆటో, ట్రాలీ డ్రైవర్లు, సిఐటియు నాయకులు

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

విరివిగా విరాళలు ఇవ్వాలని జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండలో సెప్టెంబర్ 13,14తేదీల్లో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సెప్టెంబరు 13న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటారని, అఖిల భారత రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారని అన్నారు. మహాసభకు 300 మంది ప్రతినిధులుగా హాజరవుతున్నారని, కావున ఈ మహాసభల నిర్వహణకు ఆర్థికంగా, హార్ధికంగా సహకరించాలని కార్మికులను కోరారు. అనంతరం జిల్లా మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శియమ్మల మన్మధరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ సంస్థలు పరిపరక్షణకు, ప్రభుత్వ పథకాల సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలపై కార్మికుల పక్షాన నికరంగా నిలబడి ఉద్యమాలను నడుపుతున్న సంఘం సిఐటియు అని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అనేక పోరాటాలను నిర్వహిస్తుందని తెలిపారు. దేశంలో ప్రబలుతున్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా మత సామరస్యాన్ని కాపాడేందుకు దేశ నమైక్యత కోసం సిఐటియు పోరాడుతుందని అన్నారు. మోటారు, భవన నిర్మానం, రైస్ మిల్లు, ముఠాకళాసీలు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపైనా, కార్మిక, ఉద్యోగుల పనిదినాన్ని 8 గంటల నుండి 12 గంటలకు పెంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడుతున్నదని వివరించారు. సామాన్య ప్రజానీకానికి విద్య, వైద్యం, ప్రజాపంపిణీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని, పోరాటాలను నిర్మించిన సంఘం ఎన్నో నిర్బంధాలను లెక్కచేయకుండా కార్మిక, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న సంఘంగా సిఐటియు గుర్తింపు పొందిందని అన్నారు. ఈ నేపథ్యంలో 11వ జిల్లా మహాసభలు పాలకొండలో జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, బి.సూరిబాబు, జి.ఈశ్వరరావు, కృష్ణ, దిలీపు, కష్ణ, శ్రీను పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సాలూరు రూరల్: సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలను పాలకొండలో నిర్వహిస్తున్నామని దీనికి కార్మిక వర్గమంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. మండలంలోని పెదపదంలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గేదెల సునీత మాట్లాడుతూ స్కీం వర్కర్లు, కార్మికులు ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ఈ మహాసభలో చర్చించి రాబోయే మూడేళ్లలో పోరాట కార్యక్రమాలు గురించి చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కన్నమ్మ, ఈశ్వరమ్మ, గంగ, రాధా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ పిఒగా పవర్ స్వప్నిల్ జగన్నాథ్

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ స్థానిక ఐటిడిఎ పిఒగా (పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఎసి) ఇచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

కారాడవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలో ఉన్న హెచ్.కారాడవలస గ్రామంలో గురువారం బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, గర్భిణులు, బాలింతలకు అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావలసిన మందులను ఉచితంగా అందించారు. జ్వరాల లక్షణాలు గుర్తించి, రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు, సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో రోజూ వైద్య పరీక్షలు చేస్తుండాలని ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా వారిని త్వరగా గుర్తించి వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో జరుపుకునే వినాయక ఉత్సవాలకు సంబంధించి పోలీసుల అనుమతులు తప్పనిసరి అని మక్కువ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. గ్రామాల్లో జరుపుకునే వినాయక ఉత్సవాలకు ఏర్పాటు చేసే మండపాలు వద్ద మైక్ సౌండ్ ఇతరత్రా వినోదాలకు సంబంధించిన పోలీసులు అనుమతినీ సంబంధిత నిర్వాహకులు తీసుకుని ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల జరుపు కోవాలి అని సూచించారు.

మోసాలపై అధికారులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వారపు సంతల్లో పండ్లు, ఇతర వస్తువులు అమ్మకాలు చేపడుతున్న వ్యాపారులు తూనిక కొలతల్లో గిరిజనులను మోసగిస్తున్నారని గిరిజన సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకరరావు తెలిపారు. దీనివల్ల ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, సామాన్య ప్రజలు అధికంగా నష్టపోతున్నారని అన్నారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో జరిగిన వారపు సంతలో జరిగే అక్రమాలు తమ దృష్టికి వచ్చాయని, స్వయంగా వెళ్లి వారిని దండించినట్టు తెలిపారు. ఇటీవలి కాలంలో తూనికలు-కొలతల శాఖ నిఘా తగ్గిపోవడంతో ఈ అక్రమాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అప్రమత్తమై, ఏజెన్సీలో జరిగే సంతల్లో తనిఖీలు నిర్వహించి, మోసాలను అరికట్టాలని కోరారు.

ప్రజలకు సక్రమంగా సరుకులు అందాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజలకు సక్రమంగా సరుకులు అందాలని స్థానిక తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్ డీలర్లకు సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారునికి సక్రమంగా సరుకులు సకాలంలో అందజేయాలన్నారు. ప్రభుత్వ ఇచ్చిన ప్రతి వస్తువును లబ్ధిదారునికి అందజేయాలన్నారు. ఈనెలలోనే కొత్తగా కార్డులు ప్రభుత్వం మంజూరు చేస్తే వాటిని అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో హెచ్‌డి ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, వివిధ గ్రామాల రేషన్ షాపుల డీలర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఇఒపిఆర్‌డి

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి సచివాలయాన్ని ఇఒపిఆర్‌డి కెకె వర్మ గురువారం సందర్శించారు ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బంది రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మాణం చేపట్టిన గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్మాన రాధా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

బదిలీ ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెద్దగొత్తిలి సచివాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి వేరే చోటికి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో గురువారం సచివాలయం వద్ద వెల్ఫేర్ అసిస్టెంట్ కె.మనోహర్, విఎఎ భార్గవి, సర్వేర్ మన్మథ, వెటర్నరీ సిబ్బంది పివి శ్రీనివాసరావు, ఎఎన్ఎంను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో ప్రజలందరితో మమేకమై నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి పనులు చేసి అందర్నీ ఆకొట్టుకొనేలా విధులు నిర్వహించారన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించి తమ పంచాయతీ నుంచి వెళ్తున్నందుకు తమకు బాధగా ఉన్నప్పటికీ వారు విధులు నిర్వహించడానికి ఉద్యోగరీత వెళ్లక తప్పని పరిస్థితుల్లో వారికి ఆత్మీయ వీడ్కోలు పలికి పంపించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చంటి, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ నియామక ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ఆరిక మురళి ఎపిఎస్‌పి పోలీస్ ఉద్యోగానికి ఎంపిక కావడం సంతోషకరమని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. మండలంలోని మంగళాపురానికి చెందిన మురళి డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి బోటనీ గ్రూపులో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడని తమ కళాశాలలో చదివిన వ్యక్తి ఉద్యోగం సాధించడం తమకు గర్వకారణమని అన్నారు.

హెచ్‌ఎంల సంఘం అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- వీరఘట్టం

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని డివిఎంఎం హైస్కూల్లో గురువారం ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉల్లిభద్ర ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం పిసిహెచ్ శ్రీనివాసరావు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ రత్నాకర్, కోశాధికారిగా కె.ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులుగా జి.రవిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్స్ డి.సూర్యచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, టి.శంకర్రావు, మహిళా ఉపాధ్యక్షులు నాగమణి, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణ, మహిళా ప్రతినిధిగా జె.ప్రపూర్ణ కుమారితో పాటు లీగల్ కమిటీ సభ్యులు, ఆడిట్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పంటలు ధ్వంసం

- బీభత్సం సృష్టిస్తున్న ఏనుగులు
- లబోదిబోమంటున్న రైతులు
- పరిహారం అందించని ప్రభుత్వం

ఒడిస్సా ప్రాంతం నుంచి 8 ఏళ్ల క్రితం వచ్చిన ఏనుగుల గుంపు ఈ ప్రాంతాన్ని విడడం లేదు. దీంతో ఆరుగాలం వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించాల్సిన రైతన్నలు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో లబో దిబో మంటూ రోదిస్తున్నా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు తమ భార్యల మెడలో తాళిబొట్లను కూడా తాకట్టు పెట్టుకుని వ్యవసాయం చేస్తూ కష్టపడుతుంటే పంట చేతికి వచ్చే సమయానికి ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంపై ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ గుండెపోటుకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగ రేగువలస గ్రామానికి చెందిన కోడి తిరుపతిరావు అనే రైతు గ్రామ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న సాగు చేసుకున్నారు. ఇటీవల కాలంలో ఏనుగుల గుంపు మండలంలోకి రాకపోవడంతో ఈ ప్రాంత రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల క్రితం మండలంలో గంగ రేగువలస సమీపంలో ఏనుగుల గుంపు తిష్టి వేసి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుపతిరావు మొక్కజొన్న పంటను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో గురువారం ఆ రైతు తమ పంట పొలంలో నష్టపోయిన పంటను చూపిస్తూ లబోదిబోమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ఏళ్ల క్రితం వచ్చిన ఏనుగుల గుంపు తమ పంట పొలాలను నాశనం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును కాపలా కాస్తున్నారే తప్ప తరలించడానికి, రైతు పంటలను కాపాడడంలో ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇలా గతంలో ఆర్థికంగా నష్టపోయిన తనకు గుండెపోటు కూడా వచ్చిందని ఆపరేషన్ చేసుకొని తిరిగి రోగిగా ఉన్నప్పటికీ వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాన్ని పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఏదో కష్టపడి బతుకుతుంటే ఏనుగుల గుంపు ఇలా ప్రతిసారి చేతికి వచ్చిన పంటలను ధ్వంసం చేయడంపై అప్పులు తీర్చలేక బతకలేక చావలేక మధ్యలో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల గుంపు సంచారంతో పంట పొలాలతో పాటు పొలాల్లో ఉన్న సోలార్ బోర్లు, మోటర్లు, రేకు షెడ్లు ఇలా అనేక రకాలుగా వస్తువులను ధ్వంసం చేస్తూ రైతును తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. ఏనుగుల గుంపును శాశ్వతంగా తరలించి నష్టపోయిన పంటలకు పరిహారం ఇస్తారా లేకపోతే తమను ఆత్మహత్యలు చేసుకోమంటారా అని ప్రశ్నించారు.

అందని నష్టపరిహారం

ఈ ప్రాంతంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు దాదాపు కోట్ల మేర పంట నష్టం చేసినప్పటికీ రైతులకు మాత్రం అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అటవీశాఖ అధికారులు ఏనుగుల గుంపులు శాశ్వతంగా తరలించి రైతులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందించాలని రైతు కోరుతున్నారు.

ధ్వంసమైన పంటను చూసి రోదిస్తున్న రైతు తిరుపతిరావు

ఏనుగులను తరలించి రైతులను ఆదుకోవాలి..సిపిఎం

ఏనుగులను ఈ ప్రాంతం నుంచి పూర్తిగా తరలించి నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గంగరేగువలస గ్రామంలో రైతు ఆవేదన వీడియోపై ఆయన స్పందిస్తూ మాట్లాడారు. 8 ఏళ్లుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపుతో కొమరాడ మండలంలోని రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏనుగులు తరలిస్తాం అంటున్నారు తప్ప ఏనుగులు తరలింపు చర్యలు చేపట్టడం లేదని అన్నారు. ఇప్పటికైనా ఏనుగులను శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు.

25లోగా ట్యాంకుల ప్రతిపాదనలు రావాలి : కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కోసం ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. దీని ద్వారా చిన్న నీటిపారుదల మౌలిక సదుపాయాల పరిస్థితి, నిర్వహణను మెరుగుపర్చడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచే ప్రయత్నాల్లో కీలకమైన భాగం కానుందని అభిప్రాయపడ్డారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటిపారుదల శాఖపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సంబంధించిన ట్రిపుల్ ఆర్ ప్రతిపాదనలన్నీ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 100 ట్యాంకులకైనా ప్రతిపాదనలు తయారు చేయాలని, సోమవారం నాటికి కనీసం 25 ట్యాంకుల డిపిఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే నెలలోగా మిగిలిన ట్యాంకుల డిపిఆర్‌లు తయారు చేయాలని సూచించారు. ఈ పనులు చేపట్టడం వల్ల వేసవిలో భూగర్భ జలాలు ఇంకి పోకుండా ఉండేందుకు ఎంతో ప్రయోజనకరం గా ఉంటుందని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.ధర్మ చంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, నీటిపారుదల శాఖ ఇఇ డిఎస్ ప్రదీప్, భూగర్భ జలవనరుల శాఖ ఇఇ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సత్వర గుర్తింపుతో కేన్సర్ బారి నుంచి తప్పించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఎన్‌సిడి 4.0లో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యాధికారులు, సిబ్బందికి గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్, డెంటల్ వైద్యులు కేన్సర్ స్క్రీనింగ్‌పై పవర్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను ఉద్దేశించి డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం కేన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. వీటిని క్షేత్ర స్థాయిలోనే సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే, వ్యాధి తీవ్రత కాకుండా ఉంటుందన్నారు. మూడు రకాల కేన్సర్లను వైద్య తనిఖీలు, పరీక్షలతో అనుమానిత లక్షణాలను వైద్య సిబ్బంది ఎలా గుర్తించాలి, తదుపరి కార్యాచరణపై శిక్షణలో వివరించిన అంశాల్ని వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు జరిపి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే బిపి, షుగరు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పర్యవేక్షిం చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు మాట్లాడుతూ ఎన్సీడి4.0 లో క్యాన్సర్ సర్వే, స్క్రీనింగ్ పై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారిస్తుందని, ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర స్థాయి శిక్షణలు గత నెల జిల్లా ఎన్‌సిడి బృందాలకు నిర్వహిం చారని, ప్రస్తుతం జిల్లా స్థాయి శిక్షణలు నిర్వహిస్తూ కేన్సర్ సర్వేకు వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని సంసిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో ఎన్‌సిడి కోఆర్డినేటర్ సునీల్, డిఐఒ విజయమోహన్, డిపిఎంఒ రఘుకుమార్, ఎపిడిమియాలజిస్ట్ కౌశిక్, డిఎంఒ మణి, ట్రైనర్స్ గైనకాలజిస్ట్‌లు సౌమ్యశ్రీ, పూర్ణ చంద్రిక, డెంటల్ సర్జన్లు శ్యామల, లోకేశ్వర్, డెమో సన్యాసిరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ఐటిఐలో ప్రవేశానికి మూడో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మూడో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఈనెల 27న తమ నమోదు యునిక్ నంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐ నందైనా ధ్రువీకరణ చేయించుకొని ఆమోదించుకోవాలని సూచించారు. అలా చేసిన వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్టులో నమోదవుతాయన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఐటిఐలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు ఈనెల 29 ఉదయం 10గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్థానిక ప్రభుత్వ ఐటిఐకి హాజరు కావల్సిందిగా కోరారు.

ఈ ఐటిఐలో రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, మోటార్ వెహికల్, ఏడాది కోర్సులు వెల్డర్, కోపా(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డ్రెస్ మేకింగ్ ట్రేడుల్లో మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 75690 62449, 9491134464 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని కోరారు

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రభుత్వం తొమ్మిది నెలలుగా అందించవలసిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆశా వర్కర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని జీవో నెంబర్ 94 అమలు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రవిచంద్రకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఫ్రంట్ లైన్ వర్కర్లుగా ఆశ వర్కర్లతో సమానంగా ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు మానుకోవాలన్నారు. వారికి ఇచ్చిన అరకొర జీతం కూడా సకాలంలో ఇవ్వకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని 9 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ముఖ్యంగా 62 సంవత్సరాల వయోపరిమితి వీరికి చెందాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ డిఎడిఎలు ఇవ్వాలని, పనిచేసిన చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వం వారి సేవలను గుర్తించాలని జీతాలు పెంచాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం సెప్టెంబర్ 13, 14 రెండు రోజులు పాలకొండలో జరగనున్న సిఐటియు మహా సభల్లో చర్చించి పరిష్కారం కోసం కృషి చేసేందుకు పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

23 నుంచి 30 వరకు మండల కార్యాలయాల వద్ద ధర్నాలు : సిఐటియు

ప్రజాశక్తి- పార్వతీపురం

దళిత, గిరిజన, బడుగు వర్గాలకు చెందిన విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు అధ్యక్షతన గురువారం స్థానిక సుందరయ్య భవనం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 23 నుండి 30 వరకు మండల కార్యాలయాల వద్ద ధర్నాలు, సెప్టెంబర్ 2న జిల్లా విస్తృత సమావేశం నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతి, ఇవ్వాలని చెప్పారు. సిఐటియు జిల్లా, విశాఖలో జరిగే అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. దళిత, గిరిజన మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన విఆర్‌ఎల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని కోరారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని, వాచ్మెన్లు, అటెండర్లు ఎక్కడైతే అవసరమో అక్కడ సీనియారిటీ ఉన్న విఆర్‌ఎలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల పట్ల సానుభూతితో ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే స్కేలు అమలు చేయాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలకు విఆర్వోగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా నియమించాలని కోరారు. సెప్టెంబర్ 13న పాలకొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను, డిసెంబర్లో విశాఖలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను, ర్యాలీ బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు కార్యదర్శి జి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు కె. సూర్యనారాయణ, కృష్ణ, దిలీప్, పవన్ కళ్యాణ్, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పాల్గొని మాట్లాడారు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అంతర పంటలు పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చినగీసాడ పంచాయతీ గద్రజోల గ్రామంలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో, జట్టు సంస్థ పర్యవేక్షణలో అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. ప్రహరాజ్, బడి నుండి పొలంబడి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ కలిసి రైతు కిల్లక సీతారాం అంతర పంటల క్షేత్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, రాగులు, క్రరపెండలం, జొన్న, కంది, తీగజాతులు, ఆకు కూరలు వేసుకోవడం వల్ల ప్రధాన పంట ఆదాయంతో పాటు, అంతర పంటలు ఆదాయం కూడా అదనంగా రైతులకు లభిస్తుందన్నారు. శ్రీరాగి వేసుకోవడం వల్ల తక్కువ ఖర్చుతో సంపూర్ణ పోషకాలు లభ్యమవుతాయన్నారు. రైతులు ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచే విధంగా పలు పంటలు, మిశ్రమ పంటలు వేసుకోవడం వల్ల మొక్కలలో వైవిధ్యం పెంపొందించడంతోపాటు పర్యావరణాన్ని కాపాడడం, మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయన్నారు. ఈ విధంగా చేయడం వల్ల నిరంతర పంటలు నిరంతర ఆదాయం, నిరంతర ఆరోగ్యం సాధించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి రైతు కిచెన్ గార్డెన్లు వేసుకోవడం వల్ల కుటుంబ ఆహార భద్రత సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భీమారావు, సీతారాం, కోఆర్డినేటర్ ఎం. గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

బస్సు సౌకర్యం కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని జియ మ్మవలస మండల సిపిఎం కార్యదర్శి కె.సీతారాం కోరారు. పార్వతీపురం డిపో నుంచి పార్వతీపురం వయా రావి వలస, పెద్దబుడ్డిడి, చినబుడ్డిడి, అంక వరం మీదగా జియమ్మవలసకు బస్ సౌకర్యం కల్పించాలన్నారు. కురుపాం నుంచి జియ్యమ్మవలస, టికె జమ్ముకు బస్ సౌకర్యం కల్పించాలకోరారు. జియమ్మవలస మండల కేంద్రానికి గిరిజనులు రావాలంటే కురుపాం మీదుగా చాలా దూరమవుతుంద న్నారు. స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి స్పందించిపై గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం రామారావు, బి.సురేష్ ఉన్నారు.

పింఛన్లు తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన వికలాంగుల పెన్షన్లు తొలగించి కూటమి ప్రభుత్వం వికలాంగులతో విన్యాసం చేస్తోందని, ఇది చాలా అన్యాయమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం, సాలూరు నియోజకవరాల్ల ఇన్చార్జులు బత్తిన మోహన్ రావు, గేదెల రామకష్ణ, నాయకులు వి.దాలినాయుడు, టి.గౌరీ శంకర్రావు, జిల్లా నాయకులు పాలక రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పింఛన్ల రి వెరిఫికేషన్ పేరుతో జిల్లాలో సుమారు 2,781 పెన్షన్లను రద్దు చేయడం అన్యాయం అని,. ఇందులో దాదాపు అర్హులే ఉన్నారన్నారు. గతంలో 100శాతం అంగవైకల్యం, పింఛన్ అర్హమైన 40శాతం ఆపైన అంగవైకల్యం ఉందంటూ డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లు, డాక్టర్ల తనిఖీ ఇప్పుడు మారిపోవటం గమనార్హం అన్నారు. ఒకే వ్యక్తికి రెండుసార్లు తనిఖీ చేసిన డాక్టర్లు వేరు వేరు పర్సంటేజ్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో నూటికి నూరు శాతం డాక్టర్ల వైఫల్యం కనిపిస్తోంది అన్నారు. ఈ విషయంలో ముందు ఎక్కువ పర్సంటేజ్ ఇచ్చి తర్వాత తక్కువ పర్సంటేజ్ చేస్తున్న డాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటు పాలకులు అటు డాక్టర్లు అంగవైకల్యం ఉన్న వారితో ఆడుకోవడం సరికాదన్నారు. అంగవైకల్యంతో బాధపడిన వికలాంగుల జీవనాధారాన్ని తొలగించి వారి నోటి దగ్గర కూడు లాక్కోవడం సరికాదన్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి తొలగించని పెన్షన్ లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

యశ్వంత్ కుమార్ రెడ్డిని పిఒగా నియమించాలి

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ సబ్‌కలెక్టర్‌గానూ, స్థానిక ఐటిడిఎ ఇన్‌ఛార్జ్ పిఒగా పనిచేసిన సి.యశ్వంత్ కుమార్‌రెడ్డిని సీతంపేట ఐటిడిఎ పిఒగా నియమించాలని ఎపి ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మూటక రవి, అధ్యక్షులు కె.సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎం.సూరిబాబు, సెక్రటరీ ఎం.భాస్కరరావు, ఎన్.రాజారావు, గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వారాలుగా సీతంపేట ఐటిడిఎలో కీలకమైన పిఒ పోస్టు ఖాళీగా ఉందని అన్నారు. ఇప్పటికే యశ్వంత్ కుమార్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. గిరిజన, పర్యాటక అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా రోగులకు పరీక్షలు సీతంపేట వైటిసిలో జరిపి పెన్షన్ వచ్చేలా కృషి చేశారని ఒక ప్రకటనలో తెలిపారు.

పాలకొండను జిల్లా కేంద్రం చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా కేంద్రం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. పాలకొండ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం కోటదుర్గ ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాలకొండకు జిల్లా కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. జిల్లా ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. గత ప్రభుత్వం శాస్త్రీయ బద్ధంగా జిల్లాలను విభజించలేదన్నారు. పాలకొండ నుంచి పార్వతీపురానికి 55 కిలోమీటర్ల దూరం ఉందని, అదే శ్రీకాకుళానికి 36 కిలోమీటర్లు దూరం ఉందన్నారు. పాలకొండ జిల్లా చేయకపోతే శ్రీకాకుళంలోనైనా యధావిధిగా కలపాలన్నారు. కార్యక్రమంలో సాధన సంస్థ ప్రతినిధులు చౌదరి నాయుడు, బుడితి అప్పలనాయుడు, వండాను కూర్మారావు, సబ్బా నానాజీ, శిల్లా బ్రహ్మాజీ తదితరులు ఉన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేశారు.

బస్సులు నడపడం కష్టమే

పాలకొండ: రాజాం రోడ్డు బాగు చేయకపోతే బస్సులు నడపడం కష్టమేనని ఎపిపిడి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బాసుర కృష్ణమూర్తి అన్నారు. యూనియన్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ నుంచి చీపురుపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, దీనివల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 25 ఎక్స్‌ప్రెస్‌లు, 25 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయని అన్నారు. ఇటీవల మహిళలకు ఉచిత ప్రయాణంతో మరింత పెరిగిందని, దీనివల్ల డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు వల్ల బస్సులు మరమ్మతులు గురవుతున్నాయని, దీనికి డ్రైవర్ల బాధ్యులుగా యాజమాన్యం చూపిస్తుందన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు సాగర్, కార్యదర్శి దారి నాయుడు, గ్యారేజ్ యూనియన్ నాయకులు శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొండ : పట్టణంలో గాసి వీధి, చినకాపు వీధి, పెదకాపు వీధి, నెయ్యిలు వీధి, లుంబురు వారి వీధి తదితర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డిఇ కె.విష్ణుమూర్తి తెలిపారు. 11 కెవి పనులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు.

వీరఘట్టం : మండలంలోని బొడ్లపాడు ఫీడర్ పరిధిలోని ఈనెల 22న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పాలకొండ డివిజన్ ఇఇ కె.విష్ణుమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్ఫర్ నిర్వహణ, చెట్లు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టనున్న మని బొడ్లపాడు పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 9 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, ఈ అంతరాన్ని వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు డి. రామయ్య, శ్రీవాణి అన్నారు. మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ ఎస్కెపాడు గ్రామాన్ని వారు గురువారం సందర్శించారు. క్షయవ్యాధి నివారణలో భాగంగా గ్రామస్థులకు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. రామయ్య మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెండు వారాల పాటు ఆగకుండా దగ్గు వస్తున్నా, జ్వరం ఎక్కువ కాలం ఉన్నా, బరువు తగ్గుతున్నట్లున్నా డాక్టర్‌ను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడుతూ బలమైన ఆహారం తింటూ ఉంటే క్షయ వ్యాధి నయమవుతుందని భయపడాల్సిన పనే లేదని అన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ అను, వెటర్నరీ వైద్యాధికారి మునికుమార్ అన్నారు. గురువారం జియ్యమ్మ వలస మండలంలోని పెదమేరంగి, గౌరీపురంలో గల కోళ్ల ఫారాలను సందర్శించారు. కోళ్లకు కొక్కర తెగులు రాకుండా ఉండడానికి ముందస్తుగా వేయించాల్సిన టీకాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పాడి రైతులకు లింగ నిర్ధారణ వీర్యం గురించి అవగాహన కల్పించి ఆడ, దూడపెయ్యలు ఈనేటప్పుడు లింగ నిర్ధారణ వీర్యం తప్పనిసరినిగా ఎదకు వచ్చినప్పుడు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న అను, మునికుమార్